
# చవట మేనల్లుళ్ళు



అంగర వెంకట కృష్ణారావు

రాత్రి పదకొండు గంటలైంది. పోలీసు స్టేషనులో హరికేను లాంతరు మక మక మండుతూంది. ఎస్సై ఆవలించి చిటిక వేస్తున్నాడు. ఉండుండి టెలిఫోను మ్రోగుతూంది.

'గుడీవినింగ్ సార్!' అంటూ ఒక పెద్దమనిషి హడావిడిగా వచ్చి అతని కెదురుగా కూచున్నాడు. ఎస్సై ఆవలిస్తూనే గుడీవినింగ్ అన్నాడు.

'లైట్లు లేవా!'

'చూస్తున్నారుగా. టౌనంతాపోయింది'

'ఔను. ఈ చీకట్లో...

'నిజమే. లైట్లొచ్చి యీ చీకటి పోతేగాని ఏమీ తెలీదు. చీకటి అజ్ఞానం. వెలుతురు జ్ఞానం అన్నారు పెద్దలు—'. పెద్దలు అన్న మాట ఆవలిస్తూ నమిలేసి చిటికెలతో చీకటిని తరమడానికి ప్రయత్నించాడు ఎస్సై.

'నేనొక చిక్కులో పడ్డానండి. మీరు వెంటనే చర్య తీసుకోవాలి. రిపోర్టు రాసి తెచ్చా...!

'చెప్పండి—'

ఎస్సై సిగరెట్టు తీసుకొని అతని కోటిచ్చాడు. హరికేను మసక వెలుగులో చిక్కని సిగరెట్టు పొగలు చక్రాలుగా లేచి గది నాలుగు మూలలా వ్యాపిస్తున్నాయి.


"నా పేరు శ్రీనివాసరావు. పక్కవీధిలోనే మా యిల్లు. నేను కాలేజీలో లెక్చరరు పని చేస్తున్నా."

"ఐసీ. మీరేం చెప్తారు?" ఎస్సై దమ్ములాగి నిమ్మళంగా అడిగేడు.

"చరిత్ర"

"సార్. చరిత్ర పునరావృతం అవుతుం దంటారు. నిజమే?"

శ్రీనివాసరావు గతుక్కుమన్నట్టు ఎస్సై గ్రహించలేదు. అతను చదువుకున్నా. వుద్యోగాలు లేని ఆ రోజుల్లో పోలీసు జవానుగా భర్తీ ఆయేడు. నిత్యం నేరాలు నేరస్థులు అబద్ధాలాడే సాక్షులు, ఆడించే ప్లీడర్లు అతని జీవి







## చవట మేనళ్ళుల్లు

…న్ని ఆవరించుకున్నా. తను మాత్రం తామ రాకు మీద నీటిబొట్టులా పోలీసుద్యోగం లాగిం చేస్తున్నాడు. అంచేతే యిరవై యేళ్ళ సర్వీసు తరవాత చచ్చీచెడీ యెస్సై అయేడు.

"మీ రిమ్మిడియేట్ యాక్షన్ తీసుకోవా లండి!..."

"ఓ! తప్పకుండా. అసలు విషయం యేమిటో చెప్పండి"

"మా అమ్మాయి యీ వుదయం నించీ కని పించడం లేదండి"

"అలాగా? అమ్మాయి వయసెంత?"

"పందొమ్మిది—"

"చదువుకుంటూందా?"

"ఆ... బియ్యే రెండోయేడు... సార్! మీరు వెంటనే టెలిగ్రాం లివ్వండి... నాకు చాలా ఆందోళనగా వుంది"

"మేష్టారూ. మీ ఆందోళన నా కర్థ మౌతూంది. సమయానికి యీ లైట్లారిపోయేయి చూడండి. ఈ చీకట్లో నేమీ తోచడం లేదు. అయినా యీ రోజుల్లో చదూకుంటూన్న అమ్మా యిలు స్నేహితులతో సినిమాలకి, ఎక్స్‌కర్షన్లకీ యింట్లో చెప్పకుండా వెళ్ళిపోతున్నారండీ. గాభరా పడకండి. తెల్లారితే వచ్చేస్తుం దేమో..."

"నో నో సార్. నే నన్ని సినిమాహాళ్లూ చూసేశా. అమ్మాయి ఫ్రెండ్సిళ్ళకెళ్ళి వాకబ్ చేశా. ఎక్కడా లేదు. ఎవ్వరికీ తెలీదు. మీరు వెంటనే టెలిగ్రాం లివ్వండి సార్..."

"టెలిగ్రాం లెక్కడికిమ్మంటారు సార్..."

"బెజవాడ. మద్రాసు. హైద్రాబాదు. ఖరగ్ పూరు..." ఎస్సైకి నవ్వొచ్చింది. లెక్చరర్‌కి ఏడుపొచ్చింది.

లాంతరొకసారి "భగ్" మని టపటపటప మంది. కిరసనాయిలు వాసన పొగొచ్చింది.

"ఓయ్ ఫోర్‌నాట్‌త్రీ — ఇందులో కిర్స నాయిలు పోయించలేదా—" ఎస్సై అరిచేడు.

"అక్కర్లేద్సార్! నే నిప్పుడే ప్యాడ్ కాలా పీసుకెళ్ళి కనుక్కున్నా. ఐదు నిమిషాల్లో లైట్లొ చ్చేస్తున్నాయి సార్..." జవాను వరండా మీంచే అరిచేడు.

"ఏడిసినట్టుంది. ఐదు నిముషాల్లో మంత్రిగా రొచ్చేస్తున్నా రన్నట్టుంది. ఎస్సై విసుక్కున్నాడు.

"సార్! మీరు లేటు చేస్తే వాడు డేంజరస్ ఫెలో అండీ..." లెక్చరర్ అన్నాడు.

"వాడా? వాడెవడు?"

"మీ కదంతా తాపీగా చెప్తా— ముందు టెలి గ్రాంలు పంపండి. వాళ్ళు కలకత్తావో, మద్రాసో, హైద్రాబాదో పారిపోతూంటారు. జవాన్లని పంపించి వాళ్ళని తోవలోనే పట్టిం చండి. అర్జంటు సార్..."

ఎస్సై ఒళ్ళీ ఆవలించి, మరో సిగరెట్టు ముట్టించేడు.

"ఇంతకీ ఆ డేంజరస్ ఫెలో యెవడండీ..."

"వాడు చాలా ప్రమాదకరమైన వెధవ..."

ఎస్సై నవ్వాపుకున్నాడు.

"అమ్మాయి వొంటిమీద సరుకులేమన్నా వున్నాయా?"

"రెండు జతల గాజులు, ఓ నెక్లెసు. కాని వాడిక్కావలసింది అవి కాదండి. అమ్మాయ్."

ఎస్సై నవ్వినట్టు మసక వెలుతురికే తెలుసు.

"అమ్మాయికూడా చరిత్రే చదువుతూందను కుంటా..."

"మీకెలా తెలుసు?"

ఆ అదేం బ్రహ్మవిద్యా? చరిత్ర పునరావృతం అవుతుందంటారు కదండీ..."

లెక్చరరు గతుక్కుమన్నాడు.

ఓయ్ ఫోర్‌నాట్‌త్రీ ఈ లాంతర్లో చమురైనా పోయించు. లేకపోతే కొవ్వొత్తులు వెలిగించూ....!

'అక్కర్లేద్సార్ - ఐదు నిముషాల్లో...'

'మంత్రిగా రొచ్చేస్తున్నారా...'

'లేద్సార్, లైట్లొచ్చేస్తున్నాయి...' ఫోర్‌నాట్‌త్రీ అన్నాడు.

'సార్ లైట్లురాగానేమీ రిపోర్టు తీసుకుంటా'

'ఈలైట్లెప్పుడొస్తాయో' లెక్చరర్ గొణిగేడు

'అయితే మేష్టారూ. అమ్మాయిని అబ్బాయి బలవంతాన తీసుకుపోయేడా...'

'ఆ! మరంతే అనుకోవాలి...'

'పసిపిల్ల కాదుకదా అని అడిగా. అంతే మరోలా అనుకోకండి. నేనూ పిల్లలవాణ్ణే. ఇంతకీ ఆ అబ్బాయి యెవరో మీకు తెలుసా?'

'వాడు చాలా డేంజరస్ ఫెలో...' లెక్చరర్ తీవ్రంగా అన్నాడు.

'అద్సరే లెండి, అతనెవరూ అని...'

'పాతికేళ్ళుంటాయి, ఒకటిరెండు తక్కువగా. కొంచెం పొడ్డుగా వుంటాడు. ఉంగరాలజుత్తు కుడిబుగ్గమీద పుట్టుమచ్చుంది. అమ్మాయి తెల్లగా. పన్నగా వుంటుంది. ఇద్దరూ సుమారొక యెత్తులోనే వుంటారు. వాడు ఇంగ్లీషు తెగవాగుతాడు. తప్పులు మాట్లాడ్డు సుమండీ పుస్తకాలు, పత్రికలూ తెగచదువుతాడు..."

లాంతరు వత్తి భక్ భక్ మంటూంది. గోడమీది పిడలు గెంతుతున్నాయి. గదంతా కిర్సనాయిలు కంపే. "హుఁ!" అన్నాడు ఎస్సై.

వెలుతురు లేకపోడానికి తోడు చవఁటోటి ఎస్సై కొంచెం భారీ మనిషి. ఆపసోపాలు పడుతున్నాడు. "మా అమ్మాయి వట్టి అమాయకురాలండీ. వాడివల్లో పడిపోయింది. నేనుమెల్లిగా చెప్పా. వినలేదు. గట్టిగా చెప్పా. వినలేదు. వాణ్ణే మ్యారేజి చేసుకొంటాననీ పట్టుపట్టింది. నేను ఖచ్చితంగా నో అన్నా..."

లాంతరువత్తి టప టప ఒకటే కొట్టుకుంటోంది. దాని ప్రాణం బైటపడ్డానికి గింజుకొంటుంది. ఎస్సై కూడా చొక్కా వొదులుచేసుకుంటూ, ఛాతీమీద ఉఫ్ఫుఫ్ఫున వూదుకుంటూ యమయాతన పడుతున్నాడు.

"సార్! మీరు పెద్దలు. మరోలా అనుకోకండి. నాకూ ఆడపిల్లలున్నారు. అమ్మాయి అతన్ని అంతగా ప్రేమిస్తే మీకేం అభ్యంతరమండీ..."

"నో నో! వాడుట్టి దిక్కుమాలిన డేంజరస్ ఫెలోండీ మీరూ అలా అంటే యెలాగ మా ఆఫీస్గా"

"అంటే మీ వైపు కూడా వాళ్ళపక్షమే అన్నమాట. మర్లాభం లేదండి సార్. అసలీ దేశాన్ని పాలిస్తున్నదే అదది... ఎస్సై పైకి నవ్వేసేడు.

"మీరలా అనకండి సార్. వాడుట్టి పకీరు పెధవ. వాడి దగ్గర తంతే దమ్మిడీ లేదు..."


"అతని కుద్యోగం లేదా...?"

"ఉందనుకోండి..."

"చదువులేదా..."

"ఉంది. వాడూ బియ్యేవే ..."

"సార్ యీ రోజుల్లో న్యాయంగా బతకడానికి యివి రెండూ కావాలి సార్. ఇవున్నవాళ్ళు వాళ్ళ కాళ్ళమీద బతుకుతున్నారు. ఇవి లేనివాళ్ళు యితరుల వీపుల మీద బతుకు






# చవట మేనళ్ళుల్లు

తున్నారు..." ఎస్సై బాధగా అన్నాడు.

ఏమైనాసరేవాడు మా అమ్మాయిని పెళ్ళాడ్డానికి వీల్లేదార్. మీరు తొందరగా జవాన్ని పంపండి నాలుగు జంక్షను స్టేషన్లకి వైర్లు పంపండి"

"అలాగే సార్ ఈ లాంతరు కూడా తొందర పడుతోంది... ఇంతకీ ఆ అబ్బాయి మీ బంధువా...?"

"ఆ దేంజరస్ ఫెలో నా మేనల్లుడే సార్ ...!

లాంతరు ముమ్మాటు భక్ భక్ మని పూరు కుంది. గది నిశ్శబ్దంగా వుంది.

ఎలెక్ట్రిక్ దీపాలు జిగ్ మని వెలిగేయి.

ఎస్సై 'అమ్మయ్యా' అన్నాడు.

తన కెదురుగావున్న పెద్దమనిషి వేపుచూసేడు. అతనికేదో జ్ఞాపకం వస్తూన్నట్లనిపించింది. పెద్దమనిషి మాత్రం ఆవదం తాగినవాళ్లా మొహం పెట్టి కూచున్నాడు.

'మీ మేనల్లుణ్ణి మీఅమ్మాయి ప్రేమించిందా? అతనామెని ఎత్తుకుపోయేడా? అదృష్టం సార్ నిజంగా. నాకూ ఆరుగురు మేనల్లుళ్లున్నారు. వాళ్ళందరికీ యీడైన ముగ్గురు కూతుర్లున్నారు. ఒక్కడు వెధవకూడా బతిమాలినా నా పిల్లనీ చేసుకోడు. మీకు చాలా లక్కీ సార్...! ఎస్సై హృదయపూర్వకంగా జాలిగా అన్నాడు.



"నీ మురళి మ్రోతలో వలపు పిలుపుందిరా...."

చిత్రం : మారేమండ శ్రీనివాసరావు, గుంటూరు

'నోనో సార్. మీ మేనల్లుళ్లు మంచివాళ్లై వుంటారు. మా వాడు వట్టి డేంజరస్ ఫెలో...'

'సార్ మీరు మరోలా అనుకోకండి. నా కర్మ అలా కాలిందిగాని— మేనల్లుడు సాధారణంగా చవగ్గా కనిపిస్తారు. ఎక్స్క్యూజ్ మీ. మీరు మేనరికం చేసుకోలేదు కద...!'

లెక్చరరు లోపల గతుక్కుమని, పైకి నవ్వేడు.

"సార్ ! మిమ్మల్నెక్కడో చూసినట్టుందే.." ఎస్సై అతని మొహంలోకి తేరిపారచూస్తూ అన్నాడు. లెక్చరరు నాకూ అలాగే వుందన్నాడు.

"ఎస్సార్. ఇప్పుడు బాగా జ్ఞాపకం వచ్చింది. ఇరవై యేళ్ళ పైగా అయుంటుంది. మిమ్మల్ని నేనూ, మరో జవాను కలిసి పట్టేసుకున్నాం— బెజవాడ రైలుస్టేషన్లో— మద్రాస్ మెయిలు ఫస్టుక్లాసు కంపార్ట్మెంటులో..."

లెక్చరరు దిమ్మెరపోయేడు. "అలాగా? కామోసు" అన్నాడు నీరసంగా.

"కామోసేమిటి సార్ ! ఈ వెలుగుతూన్న యెలక్ట్రిక్ దీపం సాక్షిగా మిమ్మల్ని. మీతోబాటు ఓ అమ్మాయిని అరెస్టుచేశాం. మీ జీవితంలో అంత గొప్ప విషయం మీరెలా మర్చిపోయేరు సార్ ? అరెస్టయినా మీరు మీ దర్జా చూపించేరు. మా జవాన్లిద్దరికీ కాఫీ యిప్పించేరు. మీతో లేచి వచ్చిన-సారీ- వచ్చిన అమ్మాయి మిమ్మల్ని కూకలేసి మాకు టిఫిని ప్పించమన్నారు. జ్ఞాపకం వచ్చిందా... మీరెంత దర్జా చూపించేరు సార్. మీ మేనల్లుడు డేంజరస్ ఫెలో కాదండి. మా మేనల్లుళ్ళే వట్టి దద్దమ్మలు..."

లెక్చరరు నోటమాట లేదు. చరిత్ర పునరావృత మయిందని ఎస్సై యెక్కడ నేస్తాడోనని లోపల్లోపల బిక్కుబిక్కు మంటున్నాడు. టేబిలు మీద పెట్టిన రిపోర్టు కాయితం నిమ్మళంగా నుణిచి దొంగలా జేబులో పెట్టుకున్నాడు. ఎస్సై మరో సిగరెట్టు తనకిచ్చి తనోటి వెలిగించాడు. చాలా హుషారుగా వున్నాడు.

"సార్ ! మరో విషయం. ఏం అనుకోకండి. మీతో అప్పుడు వచ్చేని నమ్మాయిని చూడండి! బులాకీ పెట్టలావుంది. ఇప్పుడా పిడెక్కడుంది......"

లెక్చరరు సగం లేచాడు. "షేక్హేండ్" కోసం చెయ్యి చాపుతూ అన్నాడు — "నా తోనే వుంది. మా ఆవిడే. నా మేనమామ కూతురే..."

ఎస్సై దిగ్గున లేచాడు. ఇద్దరూ కళ్ళంట నీళ్లొచ్చేవరకూ నవ్వేరు. పెద్దమనిషి అవతలికి వెళ్ళిపోతున్నాడు. ఎస్సై కూచుని, వులిక్కిపడి "సార్ సార్! రిపోర్టిచ్చి వెళ్ళిపొండన్నాడు. పెద్దమనిషి మెట్లమీద క్షణం ఆగి 'గుడ్ నైట్' అని వెళ్ళిపోయేడు.

ఎస్సై పెద్దగా నవ్వుతూ "సార్ నాకు శుభలేఖ పంపడం మర్చిపోకండి" అని వెంటనే ఖిన్నుడై బుంగమూతి పెట్టి తలదించి "చవట మేనల్లుళ్ళు" అని గొణుక్కున్నాడు. ★